పదో తరగతి పరీక్షలపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

'పది' పరీక్షలపై దృష్టి సారించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులతో సమీక్ష

కమాన్‌చౌరస్తా, జనవరి 23: పదో తరగతి పరీక్షలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో మంగళవారం ఆమె విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి పరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి తరగతిలో విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని చెప్పారు. టీఎల్ఎం మేళాలు నిర్వహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, భాషపై దృష్టి పెట్టాలని, ప్రతి విద్యార్థి రోజుకు రెండు పేజీలు అన్ని సబ్జెక్టులు రాసేలా చూడాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో గతంలో 152 మంది విద్యార్థులు పదో తరగతిలో ఫెయిల్ కాగా, 121 మంది పరీక్ష ఫీజు చెల్లించేలా కృషి చేసినట్లు తెలిపారు. ఆ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణులయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక విభాగం

కొత్తపల్లి, జనవరి 23: గ్రంథాలయంలో దివ్యాంగుల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. గ్రంథాలయంలోని రీడింగ్ గదులను పరిశీలించారు. పాఠకులకు కల్పించిన సౌకర్యాల గురించి గ్రంథాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దివ్యాంగులు అనుకూలమైన వాతావరణంలో గ్రంథాలయానికి వచ్చి చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బ్రెయిలీ లిపీలో ఉన్న పుస్తకాలు, ఆడియో ప్లేయర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి, గ్రంథాలయ ఉద్యోగి ముదిగంటి సరిత తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

గంగాధర, జనవరి 23: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కళాశాలలో వసతుల కల్పన, మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, గీతావాణి, నిత్య, రాజమహేందర్ రెడ్డి, రాజు, మహేశ్వర్, సురేశ్, ఇందిర, రాజ్‌కుమార్, రాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కార్పొరేషన్, జనవరి 23: నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో బల్దియా పాలకవర్గం ముందుకు సాగుతున్నదని మేయర్ యాదగిరి సునీల్ రావు పేర్కొన్నారు. స్థానిక 14వ డివిజన్‌లో రూ. 39 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో నగరపాలక సంస్థకు భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేశామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బల్దియాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కార్పొరేటర్ డిండిగాల మహేశ్, బల్దియా అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, MANGALARAPU MADHURI, W/O. KARUNAKAR MANGALARAPU H.No. 8-1-96, Gandhinagar, Sircilla Town, Rajanna Sircilla Dist, TS, my Name changed as ADEPU MADHURI W/O KARUNAKAR MANGALARAPU. NTK-317638

CHANGE OF NAME

★I, AMEENA SULTHANA, D/o. Mohammed Sirajuddin, R/o. 3-6-580/A, Subash Nagar, Karimnagar, T.S. Changed My Name as AMENA SULTANA, W/o. Mohammed Hameed Pasha. NT-319343

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
నమస్తే తెలంగాణ
4 లైన్లకు 200/-
50/- అదనపు లైన్
3+1 ఫ్రీ
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

పోస్టర్ ఆవిష్కరణ

గంగాధర, జనవరి 23: కురిక్యాల గ్రామంలో మంగళవారం వికసిత్ భారత సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం వికసిత్ భారత సంకల్ప్ యాత్రకు సంబంధించిన గోడప్రతిని ఆవిష్కరించారు. సర్పంచ్ మేచినేని నవీన్‌రావు, అంగన్‌వాడీ, ఆరోగ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 23: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ కార్మికులకు పిలుపు నిచ్చారు. నగరంలోని యూనియన్ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం కార్మికుల హక్కులను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నదని మండిపడ్డారు. సమ్మెలో అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

సామిల్‌లో అగ్నిప్రమాదం

మానకొండూర్, జనవరి 23: మండల కేంద్రంలోని ఓంగణేశ్ సామిల్‌లో మంగళవారం వేకువ జామున 3 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు సామిల్‌లో నిల్వ చేసిన కలపకు నిప్పుపెట్టడంతో సుమారు రూ. 3 లక్షల విలువైన కలప కాలి బూడిదైంది. సామిల్ యజమాని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై సామిల్ యజమాని శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

గన్నేరువరం/చిగురుమామిడి, జనవరి 23: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిగురుమామిడి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించారు. గన్నేరువరం ఎస్ఐ నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీలో చిత్రలేఖనం పోటీలు

తిమ్మాపూర్, జనవరి 23: అల్గునూర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్ష పే చర్చ సందర్భంగా మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్ డ్రాయింగ్ కిట్స్, ఇతర పరికరాలు అందజేశారు. ఉపాధ్యాయులు సుశీల, మిథున్ కశ్యప్, సిబ్బంది పాల్గొన్నారు.

'బోస్' జయంతి వేడుకలు



నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు

కార్పొరేషన్/ కొత్తపల్లి/ తిమ్మాపూర్/ తెలంగాణచౌక్/జమ్మికుంట/హుజూరాబాద్‌టౌన్/ సైదాపూర్/ కమాన్‌చౌరస్తా, జనవరి 23: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, గంట కళ్యాణి-శ్రీనివాస్, గుగ్లిళ్ల జయశ్రీ, నాయకులు అర్ష మల్లేశం, బల్దియా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సుభాష్‌నగర్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్, జాతీయ కార్యదర్శి కొత్తూరి లక్ష్మణ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రమేశ్, భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఇక్కడ నాయకులు దిలీప్, రమేశ్, శ్రీనివాస్, నరేందర్‌రాజు, మల్లేశ్, గణేశ్, మణిదీప్ తదితరులున్నారు. హుజూరాబాద్ పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలు జరిపారు. అలాగే గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి లైబ్రేరియన్ ఎంకే లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. కమిటీ నాయకుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వేల్పుల రత్నం, రిటైర్డ్ ఉపాధ్యాయులు గంగిశెట్టి జగదీశ్వర్, తిరునగరి రమేశ్, ఇల్లందుల నాగేశ్వరరావు, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు తాటిపల్లి రాజన్న, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్‌లోని కొత్త బస్టాండ్ వద్ద నేతాజీ చిత్రపటానికి ఎస్ఐ ఆరోగ్యం, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఉప సర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి, నాయకులు సుగుర్తి జగదీశ్వరా చారి, శ్రీనివాస్ రెడ్డి, పొలం అంజయ్య, ఎడ్ల భూమిరెడ్డి, వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్‌లో నేతాజీ చిత్రపటానికి సుభాష్ యువజన సంఘం అధ్యక్షుడు సాయిరాం గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు జక్కు శ్రీకాంత్‌గౌడ్, బొమ్మ రామకృష్ణగౌడ్, గోపి, గణేశ్, రమేశ్, అరవింద్, జీవన్, శివ సాయి, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కసుతోనే గెస్ట్‌హౌస్ పేరు తొలగింపు

- బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులను కూల్చివేస్తారా
- ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవాలు నిర్వహించే అధికారం లేదా?
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, జనవరి 23: నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను ఆధునీకరించి కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌గా అందుబాటులోకి తీసుకురాగా, అందులో కేసీఆర్ అనే పదం వస్తున్నదన్న అక్కసుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పేరును తొలగించిందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విమర్శించారు. కరీంనగర్ జిల్లాకు పేరు తెచ్చే ఉద్దేశంతో పెట్టిన ఆ పేరును వెంటనే మళ్లీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని 37వ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరును తొలగించిన కాంగ్రెస్ ప్రభుత్వం భవనం కూడా బీఆర్ఎస్ కట్టించిందని కూల్చివేస్తుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై అక్కసుతో వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఎమ్మెల్యేగా బ్రహ్మోత్సవాలు చేసే అధికారం గంగుల కమలాకర్‌కు లేదా? అని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏడేళ్లుగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారని, ఏ రోజు కూడా ఉత్సవాలకు కాంగ్రెస్ నాయకులు రాలేదని విమర్శించారు. నగరంలోని ఇందిరాచౌక్, బస్టాండ్ చౌరస్తాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామన్నారు. కానీ, తాము అక్కడ కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు ఉన్నాయని నిర్లక్ష్యం చేయలేదని, నగరం సుందరంగా ఉండాలని అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాయకులు ప్రశాంత్‌రెడ్డి, ఆరె రవి, చంద్రశేఖర్, కిరణ్, వొడ్నాల రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

కలెక్టరేట్, జనవరి 23: ఆడపిల్లలపై వివక్ష రూపుమాపాలంటే కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం బాలికా దినోత్సవంపై జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికలు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కరీంనగర్ రూరల్, జనవరి 23: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పేర్కొన్నారు. నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ ఉన్నత విద్యామండలి (హైదరాబాద్) సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణ, పర్యవేక్షణ పద్ధతులపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సులో ప్రిన్సిపాల్ సమత, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్ సుష్మ, రసాయన శాస్త్ర విభాగాధిపతి గీతారాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవ చేయడం మహా భాగ్యం

తిమ్మాపూర్, జనవరి 23: విద్యార్థులకు సేవ చేయడం మహాభాగ్యం అని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. మహాత్మానగర్‌లోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం తన తల్లిదండ్రులు చాడ తిరుపతిరెడ్డి-లచ్చవ్వ జ్ఞాపకార్థం విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, సిబ్బంది, వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు జిరాక్స్ యంత్రం వితరణ

తిమ్మాపూర్, జనవరి 23: అల్గునూర్‌లోని సీవోఈకి విద్యార్థుల తల్లిదండ్రులు రూ. 75 వేల విలువైన జిరాక్స్ మిషన్‌ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్ రెడ్డి, తల్లిదండ్రుల కమిటీ బాధ్యులు గడప రాజు, చాతల సదానందం, అంబాల ప్రభాకర్, రాజేందర్, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కొత్తపల్లి, జనవరి 23: తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి భారతిదాస్ విశ్వవిద్యాలయంలో ఈనెల 25 నుంచి జరిగే సౌత్‌జోన్ యూనివర్సిటీ చదరంగ పోటీలకు జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు రెవిక్ వర్ధన్, నితిన్, ఎం అభిరాం, ఎస్ వరుణ్‌తేజ్ ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ కంకటి కనకయ్య, కోచ్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్, కోచ్‌తో పాటు అకాడమీ బాధ్యులు సృజన్, తరుణ్, అనూష్‌కుమార్ అభినందించారు.

పోలీసు కస్టడీకి కార్పొరేటర్, రియల్టర్

రాంనగర్, జనవరి 23: భూ ఆక్రమణ కేసులో అరెస్టు అయిన కార్పొరేటర్ తోట రాములు, చీటి రామారావును పోలీస్ కస్టడీకి ఇస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. రాజిరెడ్డి అనే వ్యక్తి తన ఇంటి నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని ఇచ్చిన ఫిర్యాదుపై కార్పొరేటర్ తోట రాములు, చీటి రామారావుపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 17న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, వీరిపై మరిన్ని భూ ఆక్రమణ ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ కోసం ఇద్దరిని కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల పిటిషన్‌పై విచారణ చేసిన న్యాయస్థానం 24 గంటల కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ తోట రాములు, చీటి రామారావును మంగళవారం సాయంత్రం కస్టడీకి తీసుకుని విచారించి బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా తిరిగి హాజరుపరుచనున్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

తిమ్మాపూర్, జనవరి 23: మహాత్మానగర్‌లోని గ్రంథాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ సందర్శించారు. గ్రంథాలయాధికారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల సమస్యలు పరిష్కరించాలి

మానకొండూర్, జనవరి 23: పిల్లల సమస్యల పరిష్కారానికి బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో సబితా సూచించారు. మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఇక్కడ ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, ఎస్ఐ శ్రీకాంత్, 1098 జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్, సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, డీసీపీవో శాంత, లేబర్ ఆఫీసర్ చక్రధర్, వైద్యాధికారి డాక్టర్ గోపాల్, ఏపీఎం నిరంజన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అరుణ, బాలల పరిరక్షణ అధికారి రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

బాలికా దినోత్సవం

గన్నేరువరం: జంగపల్లిలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిమ్మాపూర్ రూరల్/ గన్నేరువరం/చిగురుమామిడి/ కరీంనగర్ రూరల్, జనవరి 23: తిమ్మాపూర్ మండలం పర్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని సర్పంచ్ భారతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆడపిల్లల్లో రక్తహీనత నివారణకు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీఎంవో పద్మజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, శ్రీలత, ఉప సర్పంచ్ సుద్దాల రాజేశ్, ప్రైమరీ హెచ్ఎం మంజుల పాల్గొన్నారు. గన్నేరువరం మండలం జంగపల్లిలో సర్పంచ్ అటికం శారద, మెడికల్ ఆఫీసర్ సాహితీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇస్రత్ సుల్తాన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. చిగురుమామిడి మండలం ఇందుర్తి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఏసీడీపీవో అరవింద, ఎంపీటీసీ అందె స్వప్న, వార్డు మెంబర్ చింతపూల మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ హాజరయ్యారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో సర్పంచ్ గాజుల వెంకటమ్మ, డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్టు శైలజ, ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, హెచ్ఎం జానకీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఇల్లందకుంట/ గంగాధర, జనవరి 23: రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని, దుకాణాల ముందు ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సైదాపూర్, గంగాధర ఏవోలు రజిత, రాజు సూచించారు. మంగళవారం ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో గల ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు అమ్మిన ఎరువుల వివరాలను నమోదు చేయాలని దుకాణాల యజమానులకు సూచించారు.

ఖలీద్‌కు 'గిడుగు' జాతీయ పురస్కార ప్రదానం

కమాన్‌చౌరస్తా, జనవరి 23: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గల దొడ్డి కొమురయ్య హాల్‌లో సోమవారం రాత్రి గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత ఎండీ ఖలీద్‌కు 'గిడుగు' జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. ఖలీద్ ఇటీవల రాసిన 'మనమంతా ఒక్కటే' పుస్తకం ఈ పురస్కారానికి ఎంపికైంది.



గంగుల మల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గంగుల మల్లయ్య సంవత్సరీకానికి హాజరు

కార్పొరేషన్, జనవరి 23: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం కోసం ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసిన మహనీయుడు నేతాజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు జక్కుల నాగరాజు, చీటీ రాజేందర్‌రావు, పావని, విజేందర్‌రెడ్డి, రమేశ్, సాయి, వెంకటేశ్, ప్రశాంత్, కరుణాకర్, సందీప్ పాల్గొన్నారు.

మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సోషల్‌మీడియా వారియర్స్ సమావేశ ఏర్పాట్లను వినోద్‌కుమార్ పరిశీలించారు.

గోరఖ్‌పూర్ టూ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్

జమ్మికుంటలో హాల్టింగ్

- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ గ్రీన్ సిగ్నల్
- రైలు ఆగేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ

జమ్మికుంట, జనవరి 23 : 'ప్రయాణికులకు విజ్ఞప్తి గోరఖ్‌పూర్ నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే (12591/12592) ఎక్స్‌ప్రెస్ రైలు మరికొద్ది సేపట్లో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాం పైకి రానున్నది'.. ఈ కాషన్ కోసం ఏళ్ల కాలంగా ఎదురు చూస్తున్న జమ్మికుంట ప్రజల కల సాకారం కానున్నది. మరికొద్ది రోజుల్లో ఈ రైలు ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఆగనున్నది. అందుకుగాను కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ గ్రీన్ సిగ్నలిచ్చారు. అంతేకాకుండా వెంటనే రైలు ఆగేందుకు రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు రైల్వేశాఖ స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నది. జమ్మికుంట ప్రముఖ వ్యాపార కేంద్రం. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపించాలని కొన్నేళ్లుగా వ్యాపారులు, ప్రజల నుంచి డిమాండ్ ఉంది. ఎంపీలకు, మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఇదే క్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఇటీవల రైల్వే మంత్రిని కలిసి, జమ్మికుంట నుంచి ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారని, పలు రైళ్లు ఇక్కడ హాల్ట్ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముఖ్యంగా నవజీవన్, రాయపూర్, యశ్వంత్‌పూర్, దక్షిణ్, దానాపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు వెంటనే స్పందించిన రైల్వేశాఖ మంత్రి, ఆయా రైళ్లను జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో హాల్ట్(ఆపేందుకు)అంశంపై చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ ఉన్నతాధికారుల ఆదేశించారు. ఈ నేపథ్యంలో తాజాగా గోరఖ్